క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సన్మానం


కలీముల్లాను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రస్థాయిలో ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన అయ్యలూరు పాఠశాల ఉపాధ్యాయుడు కలీముల్లాను మంగళవారం రావూస్ జూనియర్ కళాశాలలో నంద్యాల జిల్లా పీఆర్‌టీయూ నాయకులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ భాస్కర రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు, రాష్ట్ర కార్యదర్శి హనుమంతు మాట్లాడుతూ ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పని చేసినప్పుడే ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సమయూన్, భూమరాజు సురేష్‌శర్మ, పీఆర్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


అభయాంజనేయ స్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో టెక్కె నాగలింగేశ్వర స్వామి ఆలయంలో వెలసిన శ్రీఅభయాంజనేయస్వామికి కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకం, సింధూరాభిషేకం నిర్వహించి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు.

మిరప పంట పరిశీలన


పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, అధికారులు

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామానికి చెందిన రామదాసు అనే రైతు మిరప పంటలో గడ్డి మందు పిచికారీ చేయగా పంటంతా ఎండిపోయింది. తన పంట నాశనం కావడానికి గడ్డిమందే కారణమని రైతు అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మంగళవారం గుంటూరు లాంఫాం హార్టీకల్చర్ సీనియర్ శాస్త్రవేత్త వెంకటరమణ పంటను పరిశీలించారు. పొలంలోని మట్టి నమూనాలు, ఎండిన మిరప మొక్కలను సేకరించారు. పరీక్షించిన అనంతరం మొక్కలు ఏ కారణంతో దెబ్బతిన్నాయనేది పది రోజుల్లో తెలుస్తుందన్నారు. కోవెలకుంట్ల ఏడీ సుధాకర్, హార్టీకల్చర్ ఆఫీసర్ నరేష్‌కుమార్ రెడ్డి, ఏఓ సునీత, వీఏఏలు ప్రవీణ్, సురేష్ తదితరులు ఉన్నారు.

శ్రీసద్గురు శ్యామ్‌చరణ్ బాబా ఆరాధన ఉత్సవాలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలోని శ్రీకరుణాలయంలో మంగళవారం శ్రీసద్గురు శ్యామ్‌చరణ్ బాబా ఆరాధన ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి పాదుకులకు అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన, నామజప కార్యక్రమం నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బెట్ట నివారణే కీలకం

నంద్యాల(సెంట్రల్): రైతులు కంది పంటలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని నంద్యాల ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రామకృష్ణారావు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం కంది పంట బెట్ట పరిస్థితుల్లో ఉందన్నారు. బెట్ట నివారణకు ట్రాక్టర్ ద్వారా నీటి తడులు ఇవ్వటంతో పాటు 19:19:19 ఒక కిలో చొప్పున 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పంట పూత దశలో ఉందని, పచ్చ పురుగు లార్వాను తినేందుకు అనుకూలంగా ఎకరాకు 10–15 పక్షి స్థావరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

బేస్‌బాల్ విజేత కర్నూలు

మిడుతూరు: మండలంలోని లక్ష్మీచెన్నకేశవ స్కూల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి 67వ ఎస్జీఎఫ్ బేస్‌బాల్ పోటీల్లో బాలికల విభాగంలో కర్నూలు జట్టు విజయం సాధించినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివకుమార్, టోర్నమెంట్ అబ్జర్వర్ జయరాముడు తెలిపారు. మంగళవారం చివరి రోజు నిర్వహించిన పోటీలకు మండల ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ, ఎంఈఓ శ్రీనాథ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పోటీల్లో బాలికల విభాగంలో మొదటి స్థానంలో కర్నూలు, రెండో స్థానం విజయనగరం, మూడో స్థానం శ్రీకాకుళం జట్లు కైవసం చేసుకున్నాయి. బాలుర విభాగంలో మొదటి స్థానంలో విశాఖపట్టణం, రెండో స్థానంలో విజయనగరం, మూడో స్థానంలో శ్రీకాకుళం, నాల్గో స్థానంలో కర్నూలు జట్లు నిలిచాయి. విజేత జట్లకు ముఖ్య అతిథులు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ తువ్వా శివరామక్రిష్టారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నాగతులసీ రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ శివకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన

- గ్రామాల్లో 'పల్లెకు పోదాం'
- సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించిన ప్రజాప్రతినిధులు, నాయకులు



పెద్దయమ్మనూరులో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ , చాగలమర్రిలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉయ్యాలవాడ: పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మిదేవి, ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామసచివాలయంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. నాలుగున్నరేళ్ల పాలనలో గ్రామంలో సంక్షేమం, అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ. 12,34,86,794లు ఖర్చు చేసిందన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కసాని ప్రతాప్‌రెడ్డి, పరిపాలనాధికారి పార్థసారథి, ఈఓపీఆర్‌డి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి

దొర్నిపాడు: ప్రతి కుటుంబంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెలుగులు నింపిందని, ఆ వెలుగులు కలకాలం ఉండాలంటే మళ్లీ సీఎం జగనే కావాలని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. పల్లెకు పోదాం కార్యక్రమాన్ని మంగళవారం డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో నిర్వహించారు. గ్రామానికి సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం 17.92కోట్లు ఖర్చు చేసిందన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు శాంతయ్య, జాకీర్, డీలర్ పెద్దన్న, చిన్నమద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో ప్రభుత్వం

ఆళ్లగడ్డ : నిత్యం అందరికీ అందుబాటులో ఉంటూ అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ మహబూబ్ ఖాన్ అన్నారు. రూరల్ మండలం ఓబులంపల్లె గ్రామంలో సర్పంచ్ ఖాశీం అధ్యక్షతన పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఖర్చు చేసిన రూ 26,51,04,914లకు సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. ఈఓపీఆర్డీ తహీర్ హుస్సేన్, ఎంపీటీసీ గౌరు సులోచన, ఉప సర్పంచ్ రవి, సచివాలయ కన్వీనర్ విశ్వనాథ్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి ఉన్నారు.

● గ్రామ స్వరాజ్యం జగనన్నతోనే సాధ్యం

చాగలమర్రి: గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం జగనన్న ప్రభుత్వంతోనే సాధ్యమని జిల్లా జేసీఎస్ అధ్యక్షుడు షేక్.బాబులాల్, మండల పార్టీ అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి ఎంపీపీ వీరభద్రుడులు అన్నారు. డి.వనిపెంట గ్రామంలో కార్యదర్శి రాజశేఖర్ అధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలోని డి.కొత్తపల్లె, చెంచుగూడెం, ఓజీ తండా గ్రామాలకు సూమారు రూ.16.00కోట్లు ప్రభుత్వం ఖర్చుచేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు గణపతిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రవి, మురళి, ఖాదర్‌బాష తదితరులు పాల్గొన్నారు. అలాగే చాగలమర్రిలోని 4వ సచివాలయ పరిధిలోని 16వ వార్డులో ఆ వార్డు సభ్యుడు వి.మహబుబ్‌షరీఫ్ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రభుత్వ పథకాలతో పేదలకు చేయూత

గోస్పాడు: ప్రభుత్వ పథకాలతో పేదలందరికీ ప్రభుత్వం చేయూత అందిస్తుందని ఎంపీపీ ఆర్థర్ సైమాన్, మండల కన్వీనర్, మాజీ ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని సాంబవరం గ్రామంలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని ఈఓఆర్డీ అనసూయ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామానికి రూ.19.16 కోట్లను సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు ఐజయ్య, ఎంపీటీసీ భారతి, నాయకులు బోరెడ్డి గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

కానాల గ్రామాభివృద్ధికి రూ.41కోట్లు

నంద్యాల(అర్బన్): గత నాలుగున్నరేళ్లలో మండల మేజర్ పంచాయతీ కానాల గ్రామంలో సంక్షేమం, అభివృద్ధికి రూ.41కోట్లు వెచ్చించిందని ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. మంగళవారం గ్రామ సచివాలయం–2 పరిధిలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు విజయశేఖర్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


డబ్ల్యూ గోవిందిన్నెలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి


ఓబులంపల్లెలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు


సాంబవరంలో పాల్గొన్న నాయకులు

● సంక్షేమ ప్రభుత్వానికి మద్దతు పలకండి

రుద్రవరం: ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చిన సంక్షేమ ప్రభుత్వానికి మద్దతు పలకాలని ఆ పార్టీ మండల కన్వీనర్ నాగేష్, అధ్యక్షుడు ప్రసాదరెడ్డి ప్రజలను కోరారు. మండల పరిధిలోని మందలూరులో మంగళవారం నోడల్ అధికారులు శ్రీనివాసశర్మ, గ్రామ సర్పంచు నిర్మలమ్మ అధ్యక్షతన పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు వీరశంకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, జయరాముడు తదితరులు పాల్గొన్నారు.


మందలూరులో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

● వాడ వాడలా సంక్షేమాభివృద్ధి

నంద్యాల(సిటీ): వాడ వాడలా సంక్షేమ అభివృద్ధి వెల్లివిరుస్తోందని 10వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ మజీద్ అన్నారు. మంగళవారం స్థానిక 10వ వార్డు పరిధిలో వార్డుకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో డైరెక్ట్ బెనిఫిట్, నాన్ డీబీటీ కింద రూ.12.32 కోట్లు అందాయన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు సలాముల్లా, మెప్మా సీఎంఎం విజయ భాస్కర్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఆఫీసర్ రిజ్వాన తదితరులు పాల్గొన్నారు.


నంద్యాల 10వ వార్డులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు

23న జాబ్‌మేళా

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఈనెల 23న హెచ్‌ఆర్ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు శ్రీ రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో యాక్సిస్ బ్యాంకు, పేటీఎం, డీబీఎస్ బ్యాంకు, ఐడీబీఐ, మెడిప్లస్, అపోలో తదితర కంపెనీలు హాజరవుతారని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, పీజీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ విద్యార్థులు అర్హులన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు జాబ్ మేళా కార్యక్రమం ఉంటుందన్నారు.

నేడు గుండంపాడులో 'పల్లెకు పోదాం'

శిరివెళ్ల: మండలంలోని గుండంపాడులో ఈ నెల 22న పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపారు. నాలుగున్నర సంవత్సరాల్లో గ్రామ ప్రజలకు అందిన సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరణ జరుగుతుందన్నారు. సచివాలయ సిబ్బంది, అధికారులు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి

రుద్రవరం: రాబోయే విద్యా సంవత్సరానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంఈఓ కోటయ్య, శ్రీలక్ష్మి సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. వారు వచ్చే విద్యా సంవత్సరానికి ఆన్యువల్ వర్క్ ప్లాన్ అండ్ బడ్జెట్ అంచనాలు వేయాలన్నారు. అంచనాలు వేసే విధానంపై వారికి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐఈఆర్పీ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : రానున్న 2024–15 విద్యా సంవత్సరం సంబంధించి పాఠశాలల నిర్వహణపై ప్రణాళికబద్ధంగా బడ్జెట్‌ను రూపొందించుకోవాలని ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి హెచ్‌ఎంలకు సూచించారు. మంగళవారం స్థానిక మోడల్‌స్కూల్‌లో మండల పరిధిలోని 32 పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.

మాజీ మంత్రి శిల్పాపై కేసుల కొట్టివేత

నంద్యాల(వ్యవసాయం): మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డిపై ఉన్న రెండు కేసులను రెండో అదనపు జిల్లా జడ్జి కిరణ్‌కుమార్ మంగళవారం కొట్టివేశారు. వివరాల మేరకు 2014 మున్సిపల్ కౌన్సిల్ మీట్‌లో గొడవలు జరగడంతో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నాయి. దీంతో మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డిపై 307, 324, 120బీ రెడ్‌విత్ ఐపీసీ 34 కింద రెండు ప్రైవేటు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో ఎటువంటి సాక్షాధారాలు రుజువు కాకపోవడంతో కేసులను కొట్టివేశారు.

అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): బనగానపల్లె పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు మాధవస్వామి అక్రమ సస్పెన్షన్‌ను వెంటనే రద్దు చేసి విధుల్లో చేర్చుకోవాలని ఫ్యాప్టో జిల్లా కార్యదర్శి సుబ్బన్న జిల్లా అధికారులను కోరారు. మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్యకు ఫ్యాప్టో, ఏపీటీఎఫ్, యూటీఎఫ్, ఏపీటీఎఫ్–1938, ఎస్టీయూ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, మద్దయ్య, మునిస్వామి, సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని విధుల్లోకి తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): బనగానపల్లె హైస్కూల్‌లో సంబంధం లేని విషయంపై టీచర్ మాధవస్వామిని సస్పెండ్ చేయడం సమంజసం కాదని, తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు, సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి విద్యాశాఖ అధికారులను కోరారు. మంగళవారం వారు మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో మనోహర్, రమణ, శేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

దొర్నిపాడు: మండలంలోని భాగ్యనగరం గ్రామం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఏఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం నాగంబొట్లపాలెం గ్రామానికి చెందిన రత్నాచారి, బంగారయ్య ద్విచక్రవాహనంపై వైఎస్సార్ జిల్లా బ్రహ్మంగారి మఠం వెళ్లారు. అక్కడి నుంచి ఆళ్ల గడ్డ మీదుగా బనగానపల్లె మండలం యాగంటి క్షేత్రానికి బయలు దేరారు. ఇంతలో భాగ్యనగరం గ్రామానికి చేరుకోగానే ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొంది. ఘటనలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరూ గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న ఏఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లి.. ప్రాథమిక చికిత్స అనతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు.బాధితుల బంధువులకు సమాచారం ఇచ్చి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో అష్టాదళ పాద పద్మారాధన సేవ



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబా చంద్రశేఖర దేవస్థానంలో మంగళవారం కార్తీక మాసాన్ని పురస్కరించుకొని అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంచే ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని మంగళగౌరి అలంకారంలో అలంకరించి అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడి బియ్యం సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే సంజీవనగర్ రామాలయంలో వెలసిన శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో స్వామివారికికి అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించారు. ముత్యాల అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.

చౌక దుకాణాల తనిఖీ నివేదికలు ఇవ్వాలి


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు ప్రతి నెల తప్పని సరిగా 10 ఎండీయూ వాహనాలు, 10 రేషన్ షాపుల తనిఖీ నివేదికలను అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో ఎండీయూ ఆపరేటర్లు, చౌక దుకాణాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటరాముడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లు ప్రతి నెల 1వ తేదీ ఉదయం 7గంటల నుంచి నిత్యావసర సరుకుల పంపిణీ చేపట్టాలన్నారు. ప్రతి ఆపరేటర్ 17వ తేదీలోగా కేటాయించిన చౌక దుకాణాల పరిధిలోని కార్డు దారులకు సరుకులు అందేలా చూడాలని సూచించారు. స్పందనలో వచ్చిన దరఖాస్తులను అధికారులు విచారించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ రాజునాయక్, ఏఎస్ఓ రవిబాబు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు చెల్లించకుంటే ఆర్‌ఆర్ యాక్ట్


బాకాయి ఉన్న దుకాణం వద్ద విద్యుత్ రెవెన్యూ రికవరీ అధికారులు

ఆళ్లగడ్డ : విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించకుంటే ఆర్‌ఆర్ యాక్ట్ తప్పదని విద్యుత్ రెవెన్యూ రికవరీ అధికారి అహమ్మద్ హెచ్చరించారు. విద్యుత్ మొండి బకాయిల వసూళ్లలో భాగంగా మంగళవారం పట్టణంలో విద్యుత్ బకాయి దారులకు నోటీసులు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు రూ.400 కోట్ల దాకా బకాయిలు ఉన్నాయన్నారు. బకాయి ఉన్న వినియోగదారులకు ఆర్ ఆర్ యాక్ట్ వర్తిస్తుందని నోటీసులు జారీ చేయడం జరుగుతుందన్నారు. నోటీసులు అందుకున్న వినియోగ దారులు నెల రోజుల్లోపు బిల్లులు చెల్లించాలని, లేని పక్షంలో చట్ట ప్రకారం ఆస్తులు జప్తు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ హుస్సేన్ బాషా, లైన్ ఇన్‌స్పెక్టర్ అమీర్ బాషా, నాగరాజు, ప్రతాపరాజు ఉన్నారు

నేటి నుంచి కులగణనపై శిక్షణ

శిరివెళ్ల: ఈ నెల 22 నుంచి మండలంలో కులగణనపై సచివాలయాలు, వలంటీర్లకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపారు. 22న మహదేవపురం, గుండంపాడు, గంగవరం, చెన్నూరు, బోయలకుంట్ల, గోవిందపల్లె సచివాలయాల సిబ్బంది, వలంటీర్లకు శిక్షణా తరగతులుంటాయనన్నారు. 23న శిరివెళ్ల, యర్రగుంట్ల, జీనేపల్లె, గుంప్రమాన్‌దిన్నె సచివాలయాల వారికి శిక్షణ ఉంటుందని తెలిపారు.

'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'కు పటిష్ట ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్


మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ (చిత్రంలో) జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల: ఈ నెల 25 నుంచి వచ్చే ఏడాది జనవరి 26 వరకు 60 రోజుల పాటు నిర్వహించే వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో యాత్ర నిర్వహణపై జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత అధికారులు జిల్లా, మండల, పట్టణ స్థాయి కమిటీలతో పాటు గ్రామ స్థాయి కమిటీలను కూడా ఏర్పాటు చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ వాటా ఉన్న పథకాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఇంకా పథకాల లబ్ధి పొందని వారిని గుర్తించి వారు సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి కార్యక్రమ నోడల్ అధికారి మంజులవాణి మాట్లాడుతూ కేంద్రం నుంచి వచ్చే 4 వాహనాల ద్వారా రోజుకు రెండు గ్రామాలు చొప్పున 489 గ్రామాల్లో పర్యటించే విధంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 24, 25, 26, 28 తేదీల్లో ప్రచార వాహనాలు జిల్లాకు రానున్నాయన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ పుల్లయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుల గణన పకడ్బందీగా నిర్వహించాలి


నంద్యాలలో మాట్లాడుతున్న మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు

నంద్యాల(సిటీ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుల గణనకు సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు సూచించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ టౌన్‌హాల్‌లో సచివాలయ, రెవెన్యూ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని తహశీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

నంద్యాల(అర్బన్): స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు కులగణన సర్వేపై ఎంపీడీఓ సుగుణశ్రీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈఓఆర్‌డీ మహిధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ సుగుణశ్రీ మాట్లాడుతూ ఇంటి సమాచారంతో పాటు సోషల్ డిటైల్స్, ఎకానమిక్, ఎడ్యుకేషన్, పర్సనల్ డేటాలను పక్కాగా చేయాలన్నారు.

దొర్నిపాడు: ఈనెల 27నుంచి ప్రారంభం కానున్న కులగణన కార్యక్రమంలో భాగంగా సచివాలయ, గ్రామ వలంటీర్లకు తహసీల్దార్ జయప్రసాద్, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు.

కులగణన సక్రమంగా చేపట్టండి

రుద్రవరం: మండలంలో కుల గణన ప్రక్రియను సక్రమంగా చేపట్టాలని ట్రైనర్లు వరలక్ష్మి, శ్రీనివాసశర్మ, గురుభాస్కర్ సూచించారు. మండంలోని వివిధ పంచాయతీలకు చెందిన కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కులగణన ప్రక్రియపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్‌ను డౌన్ లోడ్ చేసుకొని అందులో వివరాల నమోదు విధానాన్ని ప్రొజెక్టర్ ద్వారా వివరించారు.

చాగలమర్రి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో కులగణనపై శిక్షణా కార్యక్రమాన్ని చాగలమర్రి మేజర్ గ్రామ పంచాయితీ పరిధిలోని 5 సచివాలయల సిబ్బంది, వలంటీర్లుకు ఎంపీడీఓ మహబూబ్‌దౌలా ఆధ్వర్యంలో నిర్వహించారు. శిక్షకుడు మద్దూరు సచివాలయ కార్యదర్శి స్వర్ణకుమారు, ఏఎస్ఓ దస్తగిరి వలంటీర్లకు, సిబ్బందికి కులగణన ప్రక్రియపై అవగాహన కల్పించారు.

ఉయ్యాలవాడ : కులగణన సర్వేలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ రవికుమార్ మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కులగణనపై అవగాహన సదస్సు నిర్వహించారు.

చిరుధాన్యాలకు ప్రభుత్వ 'మద్దతు'

- రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేయనున్న పౌరసరఫరాల సంస్థ
- కళ్లాల వద్దకే వెళ్లి దిగుబడుల సేకరణ
- రేషన్‌కార్డుదారులకు చిరుధాన్యాల పంపిణీ



నంద్యాల(సెంట్రల్): పేద ప్రజలకు పౌష్టికాహారం అందించటమే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ముందుకెళ్తున్నారు. దీంతో పాటు రైతులకు సైతం అధిక ఆదాయాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో చిరుధాన్యాలను మద్దతు ధరతో నేరుగా రైతుల నుంచి పౌరసరఫరాల సంస్థ కొనుగోలు చేయనుంది. ఇలా సేకరించిన చిరుధాన్యాలను కార్డుదారులకు పంపిణీ చేయనున్నారు.

రైతుల వద్ద ఎంత ఉంటే అంత కొనుగోలు

ప్రభుత్వం చిరుధాన్యాలకు మద్దతు ధరను ప్రకటించింది. జొన్నలు క్వింటా రూ.3,180, రాగులు రూ.3,846, కొర్రలు రూ.2,500, కందులు రూ.7 వేలతో పౌరసరఫరాల సంస్థ నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తుంది. రైతుల వద్ద ఎంత పంట ఉంటే అంత కొనుగోలు చేసే స్వేచ్ఛను సంస్థకు ఇచ్చింది. అంతేకాకుండా చిరుధాన్యాలను విక్రయించే క్రమంలో రైతులకు ఎలాంటి వ్యయప్రయాసలు ఉండవు. రైతులకు శ్రమ లేకుండా వారి కళ్లాల వద్దకే పౌర సరఫరాల సంస్థ అధికారులు వెళ్లి కొనుగోలు చేస్తారు. రైతులకు రవాణా సమస్య ఉండకుండా ప్రభుత్వమే ఖర్చులన్నీ భరిస్తుంది.

ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్

కందులు చిరుధాన్యాలైన కొర్రలు, రాగులు, జొన్నలు పండించిన రైతులు పంటను ఈ–క్రాప్ బుకింగ్ చేసుకుని ఉండాలి. చిరుధాన్యాలను ప్రభుత్వానికి విక్రయించాలనే రైతులు ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకుంటేనే పౌర సరఫరాల సంస్థ చిరుధాన్యాలను కొనుగోలు చేస్తుంది.

కార్డుదారులకు పంపిణీ

జిల్లాలో రైతుల నుంచి కొనుగోలు చేసిన చిరుధాన్యాలు జొన్నలు, కొర్రలు, రాగులను బియ్యం కార్డుదారులకు పంపిణీ చేస్తారు. నంద్యాల జిల్లాలో 5,40,143ల కార్డుదారులు ఉన్నారు. కార్డుదారులు కోరిన మేరకు బియ్యం స్థానంలో ఒక కిలో నుంచి 3 కిలోల వరకు చిరుధాన్యాలు ఇస్తారు. ప్రస్తుతం రాగులు ఇస్తారు. రైతుల నుంచి చిరుధాన్యాలు సేకరించిన తర్వాత వాటిని కార్డుదారులకు పంపిణీ చేస్తారు.